# తిరుగు ప్రయాణం



ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి



ప్రతిరోజూ సూర్యాస్తమయం అవబోతుండగా, ఆ బింబంవైపే నిశ్చలంగా చూస్తూ, పెద్దగా నిట్టూర్చి, లోపలికి వెళ్ళిపోవటం రంగనాథానికి అలవాటు. ఆయన ఆలోచనలన్నీ రాయివేసిన నీళ్ళులాగ సుడులుతిరిగిపోతూ వుంటాయి. ఎంతో దూరం ప్రయాణంచేసి బాగా అలసిపోయిన వాడులాగ కనిపిస్తాడు.

శరీరం ఉడిగిపోయింది. వయస్సు ముడతలు మొహంలో కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. మనస్సు వికలమయిపోయింది. ప్రేమలు పెంచుకుని తన సర్వస్వం వాళ్ళే అనుకున్న ఆత్మీయులు అందరూ ఎంతోదూరంగా వెళ్ళిపోయారు, ఆయన వెనక్కుతిరిగి చూస్తే చాలా భయం ఆవహిస్తుంది. వెనకటి జ్ఞాపకాలన్నీ ఒక్కొక్కటే అమాంతం వచ్చేసి ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తూ వుంటాయి. ఇక ముందుసంగతి అగమ్యగోచరం. తెల్లారుతోందంటేనే హడలు. ఎట్లా యీ రోజు గడుస్తుందా అని దిగులు. ప్రొద్దు కూకితే సరి, మళ్ళీ తెల్లారుతుంది గదా అని ఆవేదన, ఆరాటమూను.

ప్రొఫెసర్‌గా రిటైరయిన రంగనాథానికి పెన్షన్ అటుంచి, బోలెడంత ఆస్తి వుంది. పెద్దయిల్లు, విడివిడిగా నాలుగైదు కుటుంబాలవారు సునాయాసంగా వుండిపోవచ్చు. అయితే అద్దెకివ్వాలనే తాపత్రయం ఎన్నడూ కలగలేదు. ఏమో వాళ్ళంతా ఒక్కసారి వచ్చేస్తే అప్పుడెట్లా? అందుకనే ఆయనా, ఆయన భార్య సుమిత్ర యిద్దరే వుంటారు. సుమిత్రకు కూడా డెబ్భై దాటింది. ఇంకా మన వాళ్ళు రారు. వాళ్లకోసం యీ నిరీక్షణ యెందుకు అని తనలో తాను సణుక్కుంటూ వుంటుంది.

వాళ్లిద్దరూ కూడా పగలల్లా ఏదో పనిచేస్తున్నట్టే కనిపిస్తారు. క్షణం తీరిక వుండదు. ఎప్పుడూ యిద్దరూ యేదో మాట్లాడుతున్నట్టు, చర్చించుకుంటున్నట్టు కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఏదైనా విషయంమీద రాత్రిపగలనక వాదనలోకి దిగుతారు. దీనివలన ఉన్న మానసిక వ్యధను దిగులును మరిచిపోతూ వుంటారు. ఈసారి చర్చకు వచ్చిన విషయం వలన, నిజానికి మానసిక సంక్షోభం యెక్కువయింది.

'రైట్ టు డై' అనే సబ్జెక్టుమీద రంగనాథం మనస్సు మళ్లింది.

జీవించటానికి హక్కు యెట్లా కోరుకుంటాడో మరణించటానికి కూడా స్వేచ్ఛ మానవునికి వుండితీరాలని మినూ మసానీ అభిప్రాయం. రంగనాథం ఉపోద్ఘాతం ప్రారంభించాడు.

'ఆత్మహత్యకు హక్కేమిటి. అసలు అది నేరం కూడా కద....' సుమిత్ర సమాధానం, ఆ సిద్ధాంతానికే గొడ్డలిపెట్టు.

'అది నేరం కాకూడదనే వాళ్ల వాదన. దీర్ఘ రోగాలతో బాధపడుతున్నవాళ్లకు బ్రతకటానికి యే ఆస్కారంలేని అభాగ్యులకు యిలాంటి హక్కు అవసరమట. అలాంటి యిబ్బందులు యేమీ

లేనివాళ్ళక్కూడా యీ హక్కు వుండి తీరాలనే వాదన కూడా ఆ సిద్ధాంతంలో వుంది....'

'అలాంటివాళ్ళు సూయిసైడ్ చేసుకోవాలని అనుకోనే అనుకోరు....' సుమిత్ర చాలా తేలికగా అనేసింది.

'ఎందుకు అనుకోరు.... బ్రతుకుకు అర్థంలేకపోయిన తర్వాత యింకా జీవిస్తూ వుండాల్సిన అవసరం యేమిటి' రంగనాథం ఉద్రేకపడ్డాడు.

'బ్రతుకు సార్థకం అయినప్పుడు ఆ సమయం దానంతట అదే వస్తుంది....' సుమిత్ర తన విశ్వాసాన్ని సూటిగా చెప్పింది.

'తమ వలన యెవ్వరికీ యింకా ఉపయోగంలేదు. తమల్ని అనుకునేవాళ్ళు గాని, పలకరించేవాళ్ళు గాని లేరు. యింకా ఆ బ్రతుక్కు ప్రయోజనం యేమిటి?....'

'ఏదో ప్రయోజనం వుంది కాబట్టే జీవించి వుంటున్నారు....'

'అది నీ విశ్వాసం....'

'కావచ్చు....'

'ఏమయినా ఆ వాదనలో బలం వుందని నే అనుకుంటున్నాను!' దృఢంగా అన్నాడు రంగనాథం.

'అనవసరమైన ఆలోచనలతో మీ మనస్సు పాడునేసుకుంటున్నారు. ఇంత వరకు బ్రతికివున్నది మనకోసం, మన సుఖాలకోసం, మన సౌఖ్యాలకోసం. ఇప్పుడు జీవిస్తున్నది మనకోసం కాదు. ఇతరులకోసం. ఆ పరమార్థం మనకు తెలీదు.... ఆ ఘడియ వచ్చినప్పుడే తెలుస్తుంది.... అంతే....' సుమిత్ర ఈ వాదనకు ముగింపు చేసింది.

రంగనాథం, ఆమె కళ్ళల్లోకి చూస్తూ మెదలకండా పూరుకునిపోయాడు.

కన్నప్ప రెండు కప్పుల్లోను టీ యిద్దరికీ యిచ్చి మళ్లీ తన పనిలోకి వెళ్ళిపోయాడు.

సుమిత్ర పైకి గంభీరంగా అన్నదేగాని లోపలలోపల కుమిలిపోతోంది. శరీరంలోంచి వణుకు వచ్చేస్తోంది. దుర్భరమైన జీవితాన్ని యింకా యెన్నాళ్ళ, యెన్నేళ్ళ మొయ్యాల్సివుందో యేమో అని తెగ బాధపడుతోంది. తమకు అన్నీ వున్నాయి. డబ్బుంది. ఆరోగ్యం వుంది. పిల్లలున్నారు. కాని తమకు యేమీ లేనట్టే వుంది. ఉన్నవాటిని గురించి సంతోషించకుండా, దొరకని దాన్ని గురించి యింత వ్యథపడటం యెందుకు? పిల్లలు తమల్ని నిర్దాక్షిణ్యంగా యీ వయస్సులో వదిలిపోయి వెళ్లారనేగా, తమను అలక్ష్యం చేశారనేగా, దీనికి యింత ఆరాటం యెందుకు? తనలో తాను మళ్లీ తర్కించుకుంటుంది సుమిత్ర. ఏమయినా మనస్సు కుదుటపడే సమాధానం దొరకటంలేదు.

సుమిత్ర క్షణం గతంలోకి వెళ్ళిపోయింది.

'ఇవ్వాళ మీనా కొత్త చీరెకట్టుకొచ్చిందేమిటి?....' సుమిత్ర నివ్వెరపోయింది.

'అమ్మగారూ మా పెద్దాడు, కోడలు వచ్చారు. మీకు అయ్యగార్కి దణ్ణాలు పెడతారు.' అంది.

అబ్బ! మీనా యెంత అదృష్టవంతురాలు అనుకుంది.

సుమిత్ర కళ్ళు గిర్రున తిరిగిపోయినాయి, ఒళ్ళు తూలినట్లయింది.

'వీడే మా పెద్దబ్బాయి....' మీనా తన కొడుకును సుమిత్రకు యెదురుగా నుంచోమన్నది.

సుమిత్రకు వళ్ళు తెలియలేదు.

'పెద్దవాడా...'అబ్బాయిని చూస్తుంటే, సుభాష్‌ను చూస్తున్నట్టుగానే ఊహించుకుంది. పెద్దగా అరిచింది కూడా, తనకు తెలియకుండానే.

పెద్దబ్బాయా.... అంటూ రంగనాథం వెర్రిగా కేకలేస్తూ గబగబ వచ్చాడు.

మీనా యిద్దరివంక బిత్తరపోతూ చూస్తూ నిలబడిపోయింది.

రంగనాథం కళ్ళు పెద్దవిచేసుకుని తీక్షణంగా చూస్తూ మెల్లిమెల్లిగా తేరుకుంటున్నాడు. సుమిత్ర శరీరంలో వణుకు యింకా స్పష్టంగానే కనిపిస్తోంది. ఇద్దరూ కూడా తమాయించుకుని, మీనా వైపు పలకరించటానికన్నట్టుగా చూస్తున్నారు.

మీనా మొహం విప్పారింది. కొంచెం ధైర్యంకూడా వచ్చింది.

'అమ్మగార్కి నమస్కారం చెయ్యి...' మీనా, తన కోడల్ని పురమాయించింది.

వయ్యారంగా అడుగులు వేసుకుంటూ పమిటకొంగు నడుముకు చుట్టేసుకుని, సుమిత్ర కాళ్లవైపువంగబోతూ వుండగా 'సరితా' తనలోనే తాను అనుకుని అమాంతం ఆ అమ్మాయిని కౌగిట వేసుకుని వెక్కివెక్కి పెద్దపెట్టున ఏడ్చింది.

'ఏమిటి అమ్మగారూ ఏమిటి అమ్మగారు....' అంటూ మీనా తల్లడిల్లిపోయింది.

రంగనాథం గోడను పట్టుకుని ప్రక్కనే వున్న కుర్చీలో కూలబడిపోయాడు. నుదురుమీద చెయ్యిపెట్టుకుని విలవిలలాడిపోయాడు.

మీనా వీళ్ళిద్దర్నీ చూస్తుంటే యింకా హడలిపోయింది. మీనా కొడుక్కు యేమీ అర్థంకాక బిత్తరచూపులు చూస్తున్నాడు.

సుమిత్ర తమాయించుకుంది.

'నీ కొడుకును కోడల్ని చూడంగానే సంతోషం పట్టలేకపోయాము .... అంతే .... యేం కాదు....' కళ్ళు అద్దుకుంటూ యిద్దర్నీ లోపలికి తీసుకువెళ్ళింది.

'మీనా.... ఇవ్వాళ మా యింటోనే వుండి. ఫోంచేసి వస్తాల్లే. నువ్వింటికి వెళ్ళు' అన్నది సుమిత్ర.

'అమ్మగారూ....' అని యేదో మీనా అనబోతుంటే 'నే చెపుతున్నాగా,

మవ్వేళ్ళ యింటికి....' గట్టిగానే అన్నది సుమిత్ర.

'లక్నోలో వుంటున్నారా.... నీకు బ్యాంకులోఉద్యోగంటగా... కన్నప్పా. . ఆ కప్పులు నాకియ్యి, వాళ్లకు నా చేతుల్తో నేనిస్తా....' రంగనాథం, కన్నప్ప చేతి లోంచి కాఫీ కప్పులు తీసుకున్నాడు.

మీనా కొడుకు అటూ యిటూ చూసి రంగనాథం కాళ్లవైపు వరగబోయాడు. చప్పున దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకుని ఒక్క నిముషంపాటు చలనం లేకుండా వుండిపోయాడు. రంగనాథం కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి. మళ్ళీ యిట్టే ఆరిపోతున్నాయి కూడ.

ఆనాడు యింట్లో పండగ జరుపుకున్నారు. సుమిత్రకు, రంగనాధానికి యెక్కడలేని శక్తి వచ్చినట్టయింది. ఎంతో ఆనందంగాను సంతోషంగానూ ఉండిపోయారు.

'ఇంత ఖరీదు చీర యెందుకండి....' మీనా కోడలు చాలా బిడియపడింది. ఆ అబ్బాయికూడా బట్టలు తీసుకోవటానికి మొహమాటపడ్డాడు.

'నే నిచ్చినపుడు నువ్వు తీసుకోవాలే గాని, కాదనకూడదు....' రంగనాథం తన పెద్దరికాన్ని గుర్తుచేశాడు. ఆ అబ్బాయి యేమీ మాట్లాడలేకపోయాడు.

ఒక పెద్ద ఘనకార్యం చేసినట్టు సుమిత్ర, రంగనాథం ఒకర్నొకరు లోపల లోపల అభినందించుకున్నారు.

'ఇవ్వాళ నాకు కొత్త అనుభూతి కలిగింది....' సుమిత్ర అనుకుంది. ఆ మాటలు కొంచెం బిగ్గరగానే అన్నది కూడా.

'ఏమిటి నీలోనే నువ్వు మాట్లాడుకుంటున్నావు.... అనుభూతి అంటున్నావు ఏమిటి....' అన్నాడు రంగనాథం.

'ఏంలేదు.... ఏంలేదు.... వెనకటివేవో గుర్తుకొచ్చినాయి అంతే....' సుమిత్ర కళ్ళార్పుతూ ఆయన వంక చూసింది.

'అంతే మరి, గత జీవితం అంతా జ్ఞాపకంచేసుకుంటూ వుండాల్సిందే, అవే మనకు మంచి రోజులు....' రంగనాథం వైరాగ్యంగా అన్నాడు.

'అయ్యగారూ ఎవరో యిద్దరు, ఓ సూట్‌కేసు, బాగ్ పట్టుకుని వాకిట్లో నిలబడ్డారు. మీ రెవరని అడుగుతే, రంగనాధంగారితో మాట్లాడాలని అంటున్నారు....' కన్నప్ప వచ్చి చెప్పాడు.

ఎవరబ్బా అనుకుంటూ రంగనాథం మెల్లిగా ముందుకు నడిచాడు. సుమిత్ర కూడా ఎవరయి వుంటారా అనే ఆలోచనల్తోనే వాకిట గుమ్మందగ్గరకు వెళ్ళింది.

'నమస్కారం.... మాకు యే హోటల్లోనూ రూము దొరకలేదండి.... మిమ్మల్ని అడుగుతే.... మీ యింట్లో కాస్త చోటిస్తారని.... తెలిసి.... వచ్చామండి.

'మళ్లీ మేము రేపు వెళ్లిపోతాము...' తడబడుతూ అన్నాడు.

'అసలు మీరెవరోచెప్పకుండానే....' కన్నప్ప కల్పించుకున్నాడు.

'ఏమని చెప్పమంటారు.... నా పేరవుతే మోహన్. ఈమె నా భార్య జానకి. రంగనాథంగారు చాలా ఉదార స్వభావులని, అడిగినవారికి ఆశ్రయం యిస్తారని తెలిసి వచ్చాము. మేము.... రేపు వెళ్ళిపోతాము....' మళ్ళీ తత్తరపడ్డాడు మోహన్.

'మనకు అలవాటేగా యెవరైనా వస్తే ఆ గది చూపించటం' అని మనస్సులో గుణించుకుంటూ, 'కన్నప్పా, ఆ గది చూపించు ముందర... వివరాలు తర్వాత మాట్లాడుకోవచ్చులే,అన్నాడు రంగనాథం.

సరిగ్గా అమ్మాయి, అల్లుడు లాగానే వున్నారేమిటి అనుకున్నది సుమిత్ర. ఈ మధ్య సుమిత్ర తనలో తాను లోపల అనుకోవటానికి పైకి అనటానికి అట్టే తేడా కనిపించటంలేదు. స్పష్టంగా పైకి వినిపిస్తూనే వుంటాయి కూడ.

'ఆ వయస్సులో ఏ జంటను చూసినా మన పిల్లలులాగానే వుంటారు ....' అన్నాడురంగనాథం.

'ఇదిగో కన్నప్పా మన ఆనవాయితీ వాళ్ళకు తెలీదు....వెళ్ళి చెప్పిరా అన్నాడు రంగనాథం.

నేనే వెళ్ళి చెపుతాను అన్నది సుమిత్ర.

'ఇప్పుడేగా వాళ్ళు రూముకు వెళ్ళింది. కాస్త సర్దుకోవటం గానీ....'

'మీనా యిల్లంతా శుభ్రంగా తుడిచేసి ముగ్గులు పెట్టేసెయ్యి. ఈ మాలి రెండు రోజుల బట్టీ రావటంలేదు. వాళ్ళింటికి వెళ్ళన్నా పిలుచుకురా. లేకపోతే నువ్వన్నా మొక్కలకు నీళ్ళు పొయ్యి. అసలే యెండిపోతున్నాయి. ఎవరో యింకో పనిమనిషి వుందని చెప్పావు మొన్న. నాలుగు రోజులపాటు వస్తుందేమో కనుక్కో....' సుమిత్ర మాట్లాడుతూనే లోపలికి వెళ్లిపోయింది.

అమ్మగారూ అని పిలవబోయి, ఆమె వాలకం చూసి మెదలకండా వూరుకుంది మీనా.

'ఏమిటీ యిదంతా....' కన్నప్పను అడిగింది.

'ఎవరో యేమో మొగుడు పెళ్ళాం వచ్చి ఆ రూములో వున్నారు. అప్పటినుంచిఅమ్మగారూ,అయ్యగారూసంతోషం పట్టలేకపోతున్నారు....' కన్నప్పతనకు తెలిసిందేమిటో చెప్పాడు.

'పెద్దబ్బాయిగారా'.... మీనా అప్రయత్నంగా అన్నది.

'నీకు మతి పోయినట్టుంది. పెద్దబ్బాయిగారు నాకు తెలీదా. అయినా వాళ్ళొస్తే ఆ రూములో యెందుకు వుంటారు.... నేను వాళ్ళ దగ్గరకు వెళ్ళొస్తాను.... అదుగో అయ్యగారు వస్తున్నారు....'

'మీరు మమ్మల్ని చాలా యిరకాటంలో పెట్టేస్తున్నారు. మీరు మాకు రూమిచ్చింది

గాకండా యిక్కడే భోజనాలూ అవి ..' మోహన్ కొన్ని అక్షరాలు మింగేశాడు.

'మీ యిద్దరూ మా యింటికొచ్చి, మాకు ఎంత ఆనందాన్ని, సంతోషాన్ని యిచ్చారో మీకు తెలీదు. అది మాకు తెలుసు.... అది మాకు తెలుసు....' రంగనాథం చాలా ఉద్వేగంగా అన్నాడు.

'మా యింటికి రమ్మంటే మాత్రం యెవరొస్తారమ్మా. మీ అంతట మీ రొచ్చారు. మీ రెవరో మే మెవరమో! అయినా మిమ్మల్ని చూస్తుంటే మా సుభాష్ సరితను చూసినట్టుగానే వుంది' .... పెద్దగా నిట్టూర్చింది సుమిత్ర.

'ఈ... యింట్లో... యింకా యెవ్వరూ ....' సగంలో ఆపేశాడు మోహన్.

'లేకే! మే మిద్దరమే కాదు.... కన్నప్ప వున్నాడు. మీనా వుంది. ఇప్పుడే యాదగిరి వస్తాడు. సాయంత్రం కామేశ్వరరావు వస్తాడు. ఒకరేమిటి ఎంతోమంది....' రంగనాథం గబగబ ఏకరువు పెట్టాడు.

'మీకు పిల్లలు....' అడగొచ్చా అడకూడదా అనే సంశయంతో మెల్లిగా వినిపించీ వినిపించకండా అన్నాడు.

'మాకా.... లేకేం.... ఇద్దరు కొడుకులు, యిద్దరు కూతుళ్ళు, మనవలు మనమరాళ్లు, బోలెడంత బలగం. అంతా వున్నారు.... కాని యిక్కడ లేరు. ఎక్కడెక్కడో వున్నారు....' సుమిత్ర గొంతులో గీరవచ్చింది.

'మేము పెద్దవాళ్ళం అయిపోయినాం కద. ఇంక మా అవసరం వాళ్ళకేముంటుంది. వాళ్లు ప్రయోజకులు అయ్యారు, సంపాదనపరులు అయ్యారు. వాళ్ల పిల్లల యోగక్షేమం చూసుకోవద్దూ, దాంట్లో తప్పేముంది....' రంగనాథం బరువుగా అన్నాడు.

అవునన్నట్లు మోహన్ తలవూపాడు.

'ఓపిక వున్నంతవరకు మే మిద్దరం సంపాదించాం. అయితే సంపాదించి మే మేమీ దానధర్మాలు చెయ్యలేదు. మా పిల్లలికి చదువులు చెప్పించాం. వాళ్లు పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తుంటే చూసి ఆనందిస్తున్నాం. అయినా పిల్లలకు యేం చేసినా ప్రతిఫలం ఆశించిలేదు....' రంగనాథం తెగ ఆయాసపడుతున్నాడు.

'మీరు రెస్ట్ తీసుకోండి. అలసటగా వున్నట్టున్నారు....' కొంచెంగా భయపడుతూ అన్నాడు మోహన్.

మాకు ఉన్నదంతా రెస్టేగా. ఇప్పుడు మేం చెయ్యాల్సింది యేముంది కనక.... మనస్సులో బాధ పైకి చెబితే కొంత ఉపశమనం కలుగుతుందంటారు. అందుకనే యీ కాస్త చెప్పి మా మనస్సులో బరువును కొంతవరకైనా తగ్గించుకో కలిగాము. అయితే మీకు అనవసరంగా మా సంగతి చెప్పి....' రంగనాథం యేదో అనబోతుంటే 'అబ్బెబ్బే అదేం కాదు....' మోహన్ నవ్వుమొహం పెట్టాడు.

మోహన్ అదోరకంగా జానకి వంక చూశాడు. జానకి తలవంచుకుంది.

'మీరు యింకా నాలుగు రోజులు మా దగ్గరే వుండాలని మా కోరిక.... మీరేదో దేశం చూడాలని బయలుదేరారని అమ్మాయి చెప్పింది. మంచిదే. నాలుగు వూళ్లు తిరిగితే, కొత్త విషయాలు తెలుస్తాయి....' సుమిత్ర అన్నది.

ఇంత ఆప్యాయంగా ఆదరిస్తున్న యీ పెద్దవాళ్ల ముందు అబద్ధం చెప్ప కూడదు అనుకున్నాడు మోహన్. జానకి మనస్సు చాలా గజిబిజిగా వుంది. ఎటూ తోచటంలేదు. ఒక్టే అత్తగారు కామాక్షి కళ్లల్లోకి వచ్చి కూర్చుంటుంది. 'ఈ వయస్సులో మమ్మల్ని వదిలిపెట్టి వెళ్లి పోతే మేమేం చెయ్యాలి? మీ మామగారు అసలే లేవలేకపోతున్నారు. నాకు ఓపిక అంతంత మాత్రంగానే వుంది. ఇంకా మేము యెన్నాళ్లుంటాం. నా మాట విని మమ్మల్ని వదిలి పెట్టి వెళ్లొద్దు.'

జానకి ఉలిక్కిపడింది. గుటకలు వేస్తూ అటూయిటూ చూస్తూ నివ్వెరపోతోంది.

'అసలు యీ వృద్ధాప్యమే పెద్దశాపం. దీన్ని అనుభవించి తీరాల్సిందే. ఏ జబ్బొచ్చినా మందుంటుందేమోగాని, దీనికి మందేమిటి!.... ఈ వయస్సు అందరికీ ఎప్పుడో ఒకప్పుడు రానేవస్తుంది. ఇది తప్పదు. దీంట్లో వుండే సాధకబాధకాలు యెదుర్కోవాల్సిందే.... మేము యెంతో దూరం ప్రయాణం చేశాము. ఇక ముందుకు సాగలేము. తిరుగు ప్రయాణానికి సన్నిద్ధం అవుతున్నాం ఇప్పుడు మాకు కావాల్సింది. సుష్టుగా భోజనం కాదు. డబ్బా కాదు. అయినవాళ్లనుంచి ఆదరణ అప్యాయత ఇవేమాకు కరువయి పోయినాయి....' రంగనాథం పూర్తిగా అలసిపోయాడు.

నాకు కావాల్సిందేమిటి చెప్పు. రెండు పూట్ల యింత అన్నం. కట్టుకోవటానికి బట్ట అంతేగా. ఇవి మీరు యిస్తూనే వున్నారుగా. మాకేం లోపం వుంది. తన తండ్రి అన్నమాటలు మోహన్ చెవిలో గింగురుమన్నాయి.

'మేము వాళ్లను వదిలిపెట్టేస్తే, వాళ్లకు ఆ రెండూ యిచ్చేదెవరు....' మోహన్ శరీరం వేడెక్కిపోయింది.

'వీళ్లిద్దర్నీ చూస్తుంటే నా మనస్సు యెట్లాగో వుందండి. మనం చేసిన పని యెంతవరకు సబబో నాకు తెలీటం లేదు....' జానకి చాలా ఆరాటపడుతోంది.

మనమూ ఒకనాడు యీ వయస్సులోకివస్తే, అప్పుడు.... రంగనాథం అన్న మాటలు మోహన్ మనస్సుకు గుచ్చుకున్నాయి.

నిరాదరణ నిర్లక్ష్యం యీ రెండూ మహా దారుణమైనవే. నిజమే.... అసలు ఆ వయస్సులో వాళ్లను ఆదుకునేదెవరు! నేనూ కాదని, అన్నయ్యా కాదని అంటే వాళ్లు యెక్కడుంటారు ఎక్కడికివెళతారు... మోహన్ మనస్సు బరువెక్కుతోంది.

'మీరు క్షమించాలి. మేము దేశం చూట్టానికి బయలుదేరలేదు. మేము నిజానికి....' మోహన్ ముందుకుసాగలేకపోయాడు.

'మనం యింటికి వెళ్లిపోదాం....' జానకి గద్గదంగా అన్నది.

'ఇప్పుడు మేము తిరిగి మా యింటికి వెళ్లిపోతాం.... ఇంతకంటే నేనేం చెప్ప లేను....' మోహన్ పెదిమలు తడబడుతూ అన్నాడు.

'అప్పుడే!....' రంగనాథం నివ్వెరపోతూ మోహన్ వంక చూశాడు. జానకి ప్రాధేయపడుతున్నట్లు సుమిత్ర కళ్లల్లోకి చూసింది.

— — — —